


నా కు నచ్చిన నా కథ

*మధుబాబు!*

*సాహిత్యరంగంలో సవ్యసాచి. పేరు మోసిన రచయిత. ఆయన సీరియల్ పడితే చాలు, పత్రిక హాట్ కేక్‌లా అమ్ముడైపోతుంది. ఆయన సీదా సాదా రచయిత కాదండోయ్-ప్రజారచయిత, అభ్యుదయవాది!*

*మధుబాబు-ఏసీ రూంలో కూర్చొని-చేత్తో గ్లాసు-అందులో సిగ్నేచర్ వోడ్కానో... అప్పుడు గాని సామాజికస్పృహ గల అర్జెంట్ నవల రాదు. నడివయస్సులో వున్నా నవయౌవనుడిలా మేకప్.*

*కాలింగ్ బెల్ మోగటంతో వెళ్లి తలుపు తీశాడు.*

# పాఠకులూ, జాగ్రత్త!

## డా॥ ద్వానాశాస్త్రి

"నమస్కారం సార్!" ఓ కోకిలస్వరం.

"నమస్కారం."

"నా పేరు లత. 'సబల' పత్రిక సబ్ ఎడిటర్ని."

"వెల్ కమ్. స్వాగతం" అంటూ లోపలికి తీసుకెళ్లాడు.

లత గదినంతా తేరిపారచూసింది. శ్రామికుల ఫోటోలు, శ్రీశ్రీ ఫోటో చూసింది.

"కూర్చోండి. ఏం తీసుకుంటారు?" అనటంతో లత, "ఏమీ వద్దండి" అంటూ కూర్చొంది.

"మీ పత్రికలో ఆ మధ్య ఒక సీరియల్ వచ్చింది కదా?" అడిగాడు మధుబాబు. ఏ పత్రికకు ఏమిచ్చాడో, ఏది వచ్చిందో తెలీనంత గుర్తుండనంత యమబిజీ రచయిత కదా!

"అవునండీ, 'డైనమైట్ పేలాలి' అనే మీ సీరియల్‌కు గొప్ప రెస్పాన్స్ వచ్చింది. మా పత్రిక సర్కులేషన్ కూడా పెరిగింది సార్. అందుకే మిమ్మల్ని కలిసి ధన్యవాదాలు చెప్పాలని వచ్చాను."

"దానిదేముంది? నాకూ పేరు వచ్చింది గదా...!"

"సార్, మీ అభిమానులు మాకు ఫోన్లు చేస్తున్నారు, ఉత్తరాలు రాస్తున్నారు. మీతో ఒక ఇంటర్వ్యూ తీసుకోవటానికి మా సంపాదకులు పంపించారు సార్. దయ వుంచి..." అభ్యర్థించింది లత.

"షూర్, తప్పకుండా. మాకూ ఆనందమే కదా!" అన్నాడు మధుబాబు.

"మొదటి ప్రశ్న సార్-మీ జీవితం గురించి క్లుప్తంగా చెప్పండి సార్."

"ఏముందండీ, నేనేమన్నా జాతీయనాయకుడినా? అయినా అడిగారు కాబట్టి చెప్తున్నాను. చిన్నప్పుడు సరిగా చదువుకోలేదు. అల్లరి గాంగ్‌తో తిరిగేవాణ్ణి. ఆ తర్వాత బుద్ధి వచ్చి చదువు 'కొన్నాను.' ఉన్న ఆస్తికి, అత్తవారి ఆస్తి తోడైంది. అందుకే ఏ ఉద్యోగానికీ ఎగబ్రాకకుండా ఈ అక్షరోద్యోగం చేస్తున్నాను. నాకొక భార్య, ఇద్దరు పిల్లలు. ఇక అంతే" అన్నాడు చిరునవ్వుతో చివరిమాటను నొక్కి పలుకుతూ.

లతకు ఆ నవ్వులో, ఆ నొక్కి పలకటంలో గల గూఢార్థం తెలియకపోలేదు. "మీరు నవలలనూ, కథలనూ అంత సంచలనపూరితంగా, అంత వేగంగా, అంత పఠనీయంగా ఎలా రాయగలుగుతున్నారో మా పాఠకులకు-సారీ... మీ అభిమానులకు వివరించగలరా?"

"చూడండి మిస్..."

"ఆఁ, నేను మిస్ కాను-శ్రీమతినే."

"సారీ మేడమ్... ఎలా రాయగలుగుతున్నారు అంటే ఏమని చెప్పను? అది సహజగుణం. పైగా వర్డ్స్ వర్త్ అన్నట్టు ఆ భావాలూ, ఆ వాక్యాలూ వాటంతటవే పెల్లుబికి వస్తాయి. సంఘమే నాకు మూలం. ఈ సమాజమే నా రచనలకు ప్రేరణ..."

కుర్చీ లోంచి లేచి గదిలో అటూ ఇటూ తిరుగుతూ ఆవేశంగా చెప్తున్నాడు-

"కుళ్లిన ఈ సమాజమే నన్ను ఇంతటి బాధకు గురి చేస్తోంది. ఆ బాధ లోంచే నా రచనలు వస్తున్నాయి. ప్రపంచం బాధంతా శ్రీశ్రీ బాధ అన్నట్టు ఈ సమాజబాధే నా బాధ. అవినీతి, అన్యాయాలు, హిపోక్రసీ, బూటకపు ఆశయాలూ ఇవే... ఇవే నాకు ప్రేరణ..."

"అవును సార్, మీరు 'పతిత' అనే నవలలో అభ్యుదయభావాలు బాగా చెప్పారు సార్. మహిళాభ్యుదయం మీద మీ అభిప్రాయాలు తెలియజేయరూ?" మధ్యలో అడిగింది లత.

"తప్పకుండా. ఇంత వరకూ నా ఆశయాలను ఎవరికీ చెప్పలేదు. చాలామంది నేను డబ్బు కోసం రాస్తున్నాను అనుకొంటారు. నాకు సమాజం ముఖ్యం. మహిళాభివృద్ధి ముఖ్యం. ఆడదంటే ఎంత అలుసు ఈ సమాజంలో! ఆఫీసులో ఉద్యోగం చేస్తున్నా, టైపిస్ట్‌గా చేస్తున్నా అందరి చూపులూ ఆమె వైపే. ఆడది ఒక ఆటబొమ్మ అయింది. దాసి అయింది. చరణదాసి అవుతోంది. ఏమిటీ దారుణం? అందుకే మానసికక్షోభతో ఆ 'పతిత' నవల రాశాను."

"ఇంతకీ నాకొక సందేహం. మీరు మరోలా భావించకండి."

"అడగండి... సంకోచం ఎందుకు?"

"మీరు కట్నం తీసుకోకుండానే పెళ్లి చేసుకొన్నారా? మనలో మన మాట సార్-నేనేమీ బహిరంగపరచను. అభ్యంతరం లేదంటేనే పత్రికలో రాస్తాను" లత వినయంగా అడిగింది.

"నో, నాటెటాల్! నేను దానికి బద్ధవ్యతిరేకిని. లక్షలు ఇస్తామని వచ్చారు. నో అనేశాను. పైగా నాకున్న ఆస్తి చాలు. నేనే కాదు-మా అబ్బాయికీ కట్నం తీసుకోను గాక తీసుకోను!" చాలా స్పష్టంగా ఎలుగెత్తి చాటినట్టు చెప్పాడు.

"మీరు రాసిన 'అబల' నవల అభ్యుదయవాదిగా మీకు పేరు తెచ్చిపెట్టింది గదండీ-దాన్ని గురించి వివరిస్తారా?"

"చెప్తాను. మా మేష్టారు పాఠం చెప్తూ ఓ సారి 'భరించేది భార్య' అన్నాడు. తర్వాత నా ఫ్రెండ్ 'వధువు అంటే భర్తను వధించేదిరా!' అంటూ జోక్ వేశాడు. ఇవన్నీ నన్ను కలిచివేశాయి. భార్యాభర్తల్లో భర్త ఎక్కువేమిటి? అనే ప్రశ్న నా బుర్రను దొలిచేసింది. భర్త అడుగులకు మడుగులొత్తే వ్యవస్థ పోవాలి. అప్పుడే మనది సభ్యసమాజం అవుతుంది..."

"మీకు అడ్డొస్తున్నాను. మా పత్రికలో సీరియల్‌గా వచ్చిన 'డైనమైట్ పేలాలి' నవలలో మీరు రేవతి పాత్రను అద్భుతంగా చిత్రించారు. ఆ పాత్ర చాలు, మీరెంత ప్ర'గతిశీలురో' చెప్పటానికి!" ఆనందంతో లత మాట కలిపింది.

"అఫ్‌కోర్స్... అందులో రేవతి పాత్ర మా వూళ్లో నేను చూసిన పాత్ర. తన భర్త తనను కొడుతుంటే సహించి సహించి చివరికి తిరగబడింది. అందుకే ఆ పాత్రను స్ఫూర్తిగా తీసుకొని రేవతిని సృష్టించాను. ఈ నాటి సమాజానికి కావలసింది సీత, అనసూయ, సావిత్రులు కాదు-రేవతులు1 అదీ నా ఆశయం!!"

"బాగా చెప్పారు. మీ నవలలోని పాత్రల వంటివి మీకు మీ జీవితంలో తారసపడితే...?" ప్రశ్నించింది లత.

"అర్థమైంది. మీరు మంచి ప్రశ్న వేశారు. అంటే నేను రాతల్లో అలా రాశాను గానీ నిజజీవితంలో ఎలా ప్రవర్తిస్తాను? అని మీ జర్నలిజం ఆలోచన..." నవ్వుతూ అన్నాడు.

"సారీ... నేను ఆ ఉద్దేశంతో అడగలేద్సార్!"

"ఏదైనా ఏది సదుద్దేశమే కదా! చెప్పేది ఒకటీ, చేసేది మరోటీ అయిన ఈ రోజుల్లో ద్విపాత్రాభినయం, రెండు నాల్కలు గల ఈ సమాజంలో మీరడిగిన ప్రశ్న ఎంతో విలువైనది. మీ వంటి జర్నలిస్టులు వుంటేనే అసలు బండారం బయటపడుతుంది. నా నవలల్లోని పాత్రలు నా ఆశయాలకూ, నా అభిరుచికీ నిలువుటద్దాలు. చాలాగా నా పాత్రలూ నాస్తికులే. అభ్యుదయభావాలున్నవే. ఆ పాత్రలు మానవత్వం మూర్తీభవిస్తాయి. నా నవలల్లోని స్త్రీమూర్తులు తారసపడితే చేతులెత్తి మొక్కుతాను. వారికి అండగా ఏదైనా చేస్తాను! నా ఆవేదన సఫలమయ్యే రోజు కోసం నిరీక్షిస్తూ వుంటాను..." గద్గదస్వరంతో ఇక చెప్పలేకపోయాడు మధుబాబు.

"చూశారా... ఆ పాత్రల్లో మీరంతగా లీనమైపోయి రాయబట్టే అవి సజీవపాత్రలయ్యాయి. పాఠకుల మెప్పునూ పొందారు. మా పత్రికకు మీ వంటి అభ్యుదయరచయిత దొరకటం మా అదృష్టం... ఇక నేను వెళ్తానండి."

"నా అదృష్టం ఇది. ఓకే నమస్కారం."

"మధుబాబు ఎంత మంచివాడు! ఎంత ఆదర్శవాది! నాకూ దొరికాడు-పాతచింతకాయ పచ్చడిలాగా. ఎప్పుడూ కట్టుబాట్లూ-ఆచారాలూ అంటాడు. ఆధునికభావాలు ఏవీ లేవు. ఏం చేస్తాను? దురదృష్టం... మధుబాబు భార్య గొప్ప జాతకురాలు" అనుకుంటూ బయటికి వెళ్తున్న లత, కేకలూ, అరుపులూ విని గోడ చాటున వుండి ఆలకించింది.

"ఆవిడ పత్రిక నుంచి వచ్చిందే, అందుకే అలా చెప్పాను."

"అదే అంటున్నా. ఎందుకంత నక్కవినయం? మీకసలు స్త్రీ అంటే గౌరవం వుందా? మీరొక అభ్యుదయవాదా? మీరు నాస్తికులా? ఎందుకండీ ఈ నాటకం?"-భార్య నోరు పెరిగింది.

"ఏంటే రెచ్చిపోతున్నావ్? ఎన్ని సార్లు చెప్పాను ఇలా వాగొద్దని? నీ పని ఇంటి పని. వెళ్లు. నా వ్యవహారాల్లో తలదూర్చొద్దని చెప్పలేదా పాపిష్టిముండా!"

మధుబాబు నోట ఈ మాటలా?

"నేనింక నోరు మూసుకోనండీ! ఇంట్లో నన్ను హింసిస్తూ, ఆ నవలలెందుకు? ఆ ఇంటర్వ్యూలు ఎందుకు? మీరొక మేక వన్నె పులి. మీ మొదటి భార్యను కట్నం లేదని చంపింది మీరు కాదా? నా ఆస్తి చూసి అసలు విషయం చెప్పకుండా మమ్మల్ని మోసం చేసింది మీరు కాదా? మనబ్బాయి కమ్యూనిస్టు అవుతున్నాడని వాణ్ణి చితకబాది స్వేచ్ఛ లేకుండా చేసింది ఎవరండీ? ఇవన్నీ ఇప్పుడే వెళ్లి ఆ పత్రికల వాళ్లకు చెప్పేస్తాను. ఈ నరకం నేను సహించను!" ఏడుస్తూ గొంతు పెద్దది చేసి కేకలేస్తోంది.

"ఏమిటే వాగుతున్నావ్? నీ... నోర్ముయ్!"

"బాబోయ్ కాపాడండి!" దెబ్బలు తింటున్న భార్య గోడు.

"పిచ్చిపిచ్చి వేషాలెయ్యక కూర్చోవే! నువ్వే అన్నావుగా మొదటి భార్యను ఏదో చేశానని? అదే నిన్నూ చేస్తాను! నీ ఆస్తంతా నా పేరనే వుంది, ఏమనుకొన్నావో! నా తడాఖా చూపించనా?"

చాలా కర్కశంగా... చాలా చాలా కఠోరంగా... ఇంకా చాలా అమానుషంగా మధుబాబు మాటలు...

లత మ్రాన్పడిపోయింది. ఆమె బుర్ర తిరిగిపోయింది. చేతిలోని ఇంటర్వ్యూ కాగితాలు గాలికి ఎగిరిపోతున్నాయి. వాటిని ఎలాగో తీసి వెళ్తూ వెళ్తూ ముక్కలు చేసి చెత్తకుండీలో వేసి నిట్టూర్పు విడిచింది. ■

రాజకీయాల్లో, వ్యాపారాల్లో మాత్రమే కాదు, సాహిత్యరంగంలోనూ దొంగలున్నారు. కుహనా అభ్యుదయవాదులున్నారు. ఆశయాలను ఆచరణలో పెట్టడానికి ప్రయత్నించి, గొప్ప కష్టాలు తెచ్చుకొన్నాను. తీరా చూస్తే అభ్యుదయవాదులు చెప్పే దొకటీ, చేసే దొకటీ. అటువంటి పరిస్థితులను దగ్గర వుండి గమనించి ఈ కథ రాశాను. ఇరవై ఏళ్ల క్రితం నాటి ఈ కథ-నిజానికి నేటి కథే అనిపిస్తుంది. అందుకే నాకు నచ్చిన కథ.

రచయిత

## జింకు, చేపలు గర్భిణులకు నిషేధం

గర్భవతులు జింకు సప్లిమెంట్లున్న పదార్థాలు, టయూనా అనే రకం చేపలనూ తీసుకోకూడదని చెబుతున్నారు బ్రిటిష్ శాస్త్రజ్ఞులు. వీటి ప్రభావం గర్భస్థశిశువు మీద చాలా పడుతుందట. మామూలుగా జింకున్న పదార్థాలు కడుపులోని బిడ్డ వికాసానికీ, సంక్రామకవ్యాధుల నుంచి రక్షణకూ తోడ్పడతాయి. కానీ ఇటీవలి పరిశోధనల వల్ల ఎక్కువగా టయూనా చేపలు తినటం వల్ల, బిడ్డ మెదడు మీద ప్రభావం పడుతుందని తేలింది. అంటే మానసికారోగ్యం దెబ్బ తింటుందట. కనుక టయూనా రకం చేపలను కొద్ది తక్కువగా తీసుకోమంటున్నారు పరిశీలకులు.

ఎన్.

